సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 5 । జూలై । 2023



మిస్టరీగా బాలుడి అదృశ్యం

బుట్టాయగూడెం మండలం కొత్త నరుగుడు గ్రామంలో బాలుడి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. 8లో ▸



లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెనుమంట్ర మండలం ఆలమూరులో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తూర్పుగోదావరి జిల్లా వసలపూడికి చెందిన వెంకటస్వామిరెడ్డి ప్రాణాలు కోల్పోయాడు. 8లో ▸



కర్మాగారాల్లో తనిఖీలు

తణుకు: ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మంగళవారం తణుకులోని పలు కర్మాగారాల్లో తనిఖీలు నిర్వహించింది. విపత్తుల సమయంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్



కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పెదపాడు పోలీసులు మంగళవారం తెల్లవారుజామున దాడిచేసి వాహనాన్ని సీజ్ చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని సత్యవోలు గ్రామం వైపునకు కోళ్ల వ్యర్థాలతో వాహనం వస్తోందని అందిన సమాచారం మేరకు పెదపాడు ఎస్సై కృష్ణ చల్లా తన సిబ్బందితో కలిసి దాడి చేసి వాహనాన్ని అడ్డుకున్నారు. వ్యాన్‌లోని 9 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకుని వాటిని పూడ్చివేసినట్లు చెప్పారు. వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వేళంగిణి యాత్రకు బస్సుల ఏర్పాటు అభినందనీయం

దెందులూరు: వేళంగిణి (నాగపట్నం) యాత్రకు వెళ్ళేందుకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పీ.బాల అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులను దృష్టిలో పెట్టుకుని ఆర్‌టీసీ ద్వారా సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ విషయమన్నారు. వేళంగిణి వెళ్ళడానికి ఒకే ఊరి నుంచి 20 మంది ఉంటే ఆ ఊరుకు బస్సు పంపడం సంతోషంగా ఉందన్నారు. ఏలూరు, వట్లూరు, దెందులూరు, శ్రీరామవరం, గుండుగొలను, కొవ్వలి, వేగివాడ, శనివారపుపేట, విజయరాయి, పెదపాడు, వంగాయగూడెం, ధర్మాజీగూడెం, ఏలూరు పరిసర ప్రాంత ప్రజలకు ఆర్‌టీసీ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించిందని మరిన్ని వివరాలకు ఏలూరు ఆర్‌టీసీ డిపో మేనేజర్‌ను, అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జిని సంప్రదించాలని ఫాదర్ పీ.బాల కోరారు.

అపరాధ రుసుం లేకుండా పొగాకు కొనాలి



ఢిల్లీలో వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

జంగారెడ్డిగూడెం: అదనంగా పండిన వర్జీనియా పొగాకును ఎలాంటి అపరాధ రుసుం విధించకుండా పొగాకు బోర్డు కొనుగోలు చేయాలని వర్జీనియా రైతు సంఘం నాయకులు కోరారు. ఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ సెక్రటరీ రాజేష్ అగర్వాల్‌ను వర్జీనియా రైతు సంఘం నాయకులు కొడవటి వాసుదేవరావు, అన్నంరెడ్డి సోమయాజులు కలిసి వినతిపత్రం అందజేశారు. అదనంగా పండిన వర్జీనియా పొగాకును కొనుగోలు చేసేందుకు గతంలో 4 శాతం అపరాధ రుసుం కేజీ ఒక్కింటికి రూ.1 సెస్ వసూలు చేసేవారని, అది లేకుండా వర్జీనియా పొగాకును కొనగోలు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని రైతు నాయకులు వివరించారు.

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారికి గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన నిర్వహించిన ఈ పదోన్నతులకు సంబంధించి గత నెల 30న సీనియారిటీ జాబితాను ప్రదర్శించి ఈ నెల 1, 2వ తేదీల్లో జాబితాపై అభ్యంతరాలు స్వీకరించారు. అనంతరం ఈ నెల 3న తుది సీనియారిటీ జాబితాను ప్రదర్శించారు. మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం ఖాళీగా ఉన్న 40 ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశారు. 62 మంది అభ్యర్థులను పిలవగా వారిలో 22 మంది పదోన్నతులు పొందడానికి నిరాకరించారు.

సీఐ లక్ష్మారెడ్డి సస్పెన్షన్

ఏలూరు టౌన్: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సీఐగా పనిచేస్తున్న కాలంలో పలు ఆరోపణలపై వీఆర్‌లో ఉన్న లక్ష్మారెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మంగళవారం ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన నల్లజర్ల ఎస్‌హెచ్‌వో పనిచేస్తూ ఆరోపణలు రావడంతో ఆయన్ను ఏలూరు రేంజ్ వీఆర్‌కు పంపారు.

గురువులకు అగ్రాసనం

ఉపాధ్యాయులపై వరాల జల్లు

- పదోన్నతులు.. బదిలీలు
- రెండో ఎంఈఓ పోస్టుతో పని భారం కుదింపు
- 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలు
- విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



ఏలూరులో ఎంఈఓ-2 పోస్టుల కౌన్సెలింగ్‌కు హాజరైన గ్రేడ్-2 హెచ్‌ఎంలు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. విద్యా విప్లవాన్ని తీసుకువచ్చి సర్కారీ బడుల బలోపేతానికి బాటలు వేస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు పలు పథకాలు అమలుచేస్తోంది. ఇంగ్లిష్ మీడియం చదువులు, అధునాతన వసతులను పేద విద్యార్థులకు చేరువచేసింది. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషిచేస్తోంది. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారిపై వరాలు జల్లు కురిపిస్తోంది. గత ప్రభుత్వాలు విస్మరించిన ఉపాధ్యాయుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోంది. అలాగే 1998, 2008, 2018 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల ఏళ్లనాటి కలను సాకారం చేసింది. ఇలా అన్నిరకాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యారంగ పరిపుష్టికి పాటుపడుతున్నారు.

పాతికేళ్ల కల సాకారం

1998, 2008 డీఎస్సీల క్వాలిఫైడ్ అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నారు. ఇప్పటివరకూ వారి సమస్యలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటువంటి తరుణంలో జగన్ సర్కారు వారికి తీపికబురు వినిపించింది. మినిమమ్ టైం స్కేల్ ప్రాతిపదికన వారికి ఉద్యోగాలు కల్పించింది. ఇలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 452 మందికి ఉద్యోగాలిచ్చింది. అలాగే గత ప్రభుత్వం నిర్వహించిన 2018 డీఎస్సీకి సంబంధించి అర్హులైన 270 మందికి నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి టీచర్ ఉద్యోగాలు ఇచ్చింది.

పదోన్నతుల సంబరం

ఉపాధ్యాయులకు సమయానికి రాకుండా పోయిన పదోన్నతుల సమస్యనూ వైఎస్సార్ సీపీ పరిష్కరిస్తోంది. 2019లో అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సెప్టెంబర్‌లో 164 మందికి, అక్టోబర్‌లో 71 మందికి పదోన్నతులు కల్పించింది. అలాగే 2021లో 256 మందికి పదోన్నతులు కల్పించగా.. ఇటీవల 40 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు ఇచ్చారు. ఈ క్రమంలో ఖాళీ అయ్యే 40 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను స్పెషల్ గ్రేడ్ టీచర్లకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు.

బదిలీల జాతర

ఉపాధ్యాయులకు ప్రభుత్వం బదిలీల కానుక అందించింది. ఇటీవల ప్రభుత్వ యాజమాన్యా పాఠశాలల్లోని 46 మంది స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ గ్రేడ్ టీచర్లను బదిలీలు చేశారు. వీరితో పాటు జిల్లాపరిషత్ యాజమాన్యాల్లోని 2,940 మంది ఉపాధ్యాయులకు కూడా స్థానచలనం కల్పించారు.

పాఠశాలల పటిష్ట పర్యవేక్షణకు..

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణను పటిష్ట పరిచేలా ప్రభుత్వం ఎంఈఓ-2 పోస్టులను నియమించేలా చర్యలు తీసుకుంది. దీంతో ఎంఈఓలపై పనిభారం తగ్గడంతో పాటు మరింత మెరుగ్గా సేవలందించే అవకాశం కల్పించింది. అలాగే పూర్తిస్థాయిలో ఎంఈఓ-1ల నియామకానికి చర్యలు తీసుకుంది. ప్రభుత్వ యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల నుంచి ఎంఈఓ-1లను నియమించడానికి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఎంఈఓ-2 పోస్టులను ఇప్పటికే జిల్లాపరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లాపరిషత్ యాజమాన్యం నుంచి 46 మందిని ఎంఈఓ-2 పోస్టులో నియమించారు. త్వరలోనే ఎంఈఓ-1 పోస్టును భర్తీ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వ యాజమాన్యాల్లోని హైస్కూల్ హెచ్‌ఎంలు 41 మందికి పదోన్నతులు లభించనున్నాయి.

ఉపాధ్యాయ పక్షంగా..



జగన్ సర్కారు ఉపాధ్యాయుల పక్షపాత ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుంది. ఉపాధ్యాయులకు ఇన్ని రకాలుగా అండగా నిలిచే ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నాం. పాతికేళ్ల క్రితం జరిగిన డీఎస్సీకి సంబంధించి అర్హులకు ఇప్పుడు నియామకాలు ఇవ్వడం సంచలనమే. ఈ నిర్ణయంతో ఉపాధ్యాయులపై పనిభారం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉపాధ్యాయులు ఇంత సంతృప్తికరంగా పనిచేయడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నాం.

– గెడ్డం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ..



విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు విద్యాభివృద్ధిని కాంక్షించి చేపడుతున్నట్టుగా భావిస్తున్నాం. విద్యార్థుల్లో సంపూర్ణ విశ్వాసం నింపి వారు చదువుపై ఏకాగ్రత చూపడానికి ఈ సంస్కరణలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఉపాధ్యాయులకు సైతం ప్రభుత్వం వరాలు ప్రకటిస్తోంది. గత ప్రభుత్వాలు విస్మరించిన డీఎస్సీ అర్హుల నియామకాన్ని ఈ ప్రభుత్వం చేపట్టడాన్ని స్వాగతిస్తున్నాం.

– పి.వెంకటేశ్వర రావు, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి

పదోన్నతులు అభినందనీయం



ప్రభుత్వం చేపడుతున్న పదోన్నతులు అభినందనీయం. స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా, స్పెషల్ గ్రేడ్ టీచర్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు చేపడుతుండటంతో చాలా మంది టీచర్లకు లబ్ధి చేకూరుతుంది. ఎంఈఓ-1 పోస్టులకు పదోన్నతులను ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ఇవ్వాలి. ఎంఈఓ-2లుగా ఇచ్చిన పదోన్నతులకు సంబంధించి విధివిధానాలు వెంటనే ప్రకటించాలి.

–పువ్వుల ఆంజనేయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



తణుకులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, క్షత్రియ సంఘ నాయకులు



కలెక్టరేట్‌లో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా తణుకు బ్యాంక్ కాలనీలోని క్షత్రియ కల్యాణమండపం ఆవరణలోని అల్లూరి విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారి తూటాలకు ఎదురెళ్లి వారిని ముప్పుతిప్పలు పెట్టిన పోరాటయోధుడు అల్లూరి అన్నారు. ఆ మహనీయుడి ఆశయాలను ఆచరణలో పెట్టే దిశగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, డాక్టర్ జనతరాజు, క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు భూపతిరాజు లక్ష్మీనారాయణరాజు, కార్యదర్శి పెన్మెత్స సుబ్బరాజు, కోశాధికారి శ్రీనివాసరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అల్లూరికి నివాళి

భీమవరం (ప్రకాశంచౌక్): అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో వెన్నుచూపని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. నేటి సమాజం ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం డెలివరీలు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఏరియా ఆసుపత్రులలో నూరు శాతం డెలివరీలు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్లను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య శాఖపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ఏరియా ఆస్పత్రుల్లో హెచ్‌డీఎస్ నిధుల వినియోగం తక్కువగా ఉందని, నిధులు ఖర్చు చేసి ఆస్పత్రులకు అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలన్నారు. తణుకు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏరియా హాస్పిటల్‌కు సంబంధించి లాబ్‌లు పూర్తయ్యాయా? థైరాయిడ్ పరీక్షలకు అవసరమైన పరికరాలు ఉన్నాయా? అని తెలుసుకున్నారు. వైద్యులు మరింత మెరుగైన సేవలు అందించినప్పుడే ఆ ఏరియా ఆసుపత్రికి ప్రజలలో మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ అన్నారు.

భవిష్యత్తుకు బంగారుబాట అమ్మఒడి



తణుకులో అమ్మఒడి నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో అందిస్తున్న ఫలాలను సద్వినియోగపరచుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన అమ్మఒడి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థిని తీర్చిదిద్దితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని తద్వారా దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఉద్దేశంతో విద్యావ్యవస్థలో సీఎం ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో దేశవ్యాప్తంగా ఏపీ విద్యావ్యవస్థలో 15 ర్యాంకులో ఉండేదని, నేడు జగనన్న ప్రభుత్వంలో చేసిన మార్పుల కారణంగా మూడో స్థానానికి ఎగబాకిందని స్పష్టం చేశారు.

సీఎం కృషికి సార్థకత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ ఫలాల కారణంగా నేడు విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని మంచి స్థాయికి ఎదిగినప్పుడే సీఎం అందిస్తున్న కృషికి సార్థకత లభిస్తుందని అన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లుగా కలలు కనాలని వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్టేజీపై విద్యార్థులు చేసిన నృత్యం ఆహుతులను అలరించింది. ముందుగా మంత్రి కారుమూరి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 వేలకు పైగా విద్యార్థులు ఈ సభకు హాజరుకాగా, తల్లితండ్రులు సైతం పాల్గొన్నారు. అనంతరం అమ్మ ఒడి చెక్కు నమూనాను తల్లులకు మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి అందచేశారు. డీఈవో ఆర్.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై నేరాల నిరోధానికి కృషి చేయాలి

జేసీ రామసుందర్ రెడ్డి



మాట్లాడుతున్న జేసీ రామసుందర్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలు, నేరాలు నిరోధించేందుకు సంబంధిత అధికారులు, సభ్యులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో పౌర హక్కుల రక్షణ (పీసీఆర్), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టాల అమలు తీరుపై సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత వర్గాలకు సంబంధించిన కేసులు విషయంలో అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు సుబ్బరాజు మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం డివిజన్ల పరిధిలో నమోదైన కేసుల స్థితిగతులను సమావేశంలో వివరించారు. కేసుల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. ఎస్సీ, ఎస్టీలు తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేసే అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కొంత మంది తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్నారని, వాటిపై విచారణ చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్డీవో దాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

98 శాతం తూర్పు కాపులు జగన్ వెంటే..

- నాడు వైఎస్సార్, నేడు జగన్ అండగా నిలిచారు
- భీమవరంలో పవన్ పోటీ చేస్తే మళ్లీ ఓడిస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు కాపు సంఘం నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): తూర్పు కాపులు 98 శాతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని తూర్పు కాపుల సంఘ నాయకులు స్పష్టం చేశారు. ఒక వ్యక్తి జనసేనలో చేరితే.. మొత్తం తూర్పు కాపులందరూ జనసేనలోనే ఉన్నారంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. భీమవరంలో తూర్పుకాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో భీమవరం, ఉండి, ఆకివీడు సంఘీయులు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు ముల్లి నరసింహమూర్తి, జగ్గురోతు విజయకుమార్, ఉండి జెడ్పీటీసీ రణస్తుల మహంకాళి, జిల్లా గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కరిమెరక రామచంద్రరావు మాట్లాడుతూ జనసేనలో చంద్రశేఖర్ వ్యక్తిగతంగా మాత్రమే చేరారని, ఆయన చేరికకు, తూర్పు కాపులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తూర్పు కాపులకు సంక్షేమం అందించడంతో పాటు రాజకీయంగా చైతన్యం చేసి పదవుల్లో కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని వారు వివరించారు. అలాంటి నాయకుని వెంటే తాము ఉంటామని, 2024లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. భీమవరంలో పవన్‌కల్యాణ్ పోటీ చేస్తే కచ్చితంగా ఓడించడానికే పనిచేస్తామన్నారు.

బీసీలుగా గుర్తింపు..

నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమను 10 జిల్లాల్లో బీసీలుగా గుర్తిస్తూ జీవో 62 జారీ చేసి మేలు చేశారన్నారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వం నుంచి అన్ని రకాల సాయం చేస్తూ తూర్పుకాపుల అభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. తూర్పుకాపుల నుంచి ఒకరిద్దరు యువత వెళ్లి పవన్‌తో ఫొటోలు దిగితే మొత్తం తూర్పుకాపులందరూ ఫొటోలు దిగారనే భ్రమలో ఆయన ఉన్నారని, ఆ భ్రమలో నుంచి బయటకు రావాలన్నారు. తమ సమస్యలు తీర్చే నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ లాంటి వారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకాపు నాయకులు సరిపిడకల రామారావు (పెన్నాడ శ్రీను), గలావిల్ల ధనుంజయ, పత్తివాడ శేషు, రౌతు కుమారి, ఆదాడ లక్ష్మీతులసి, గేదల అప్పారావు, లోపింటి చిరంజీవి, బొగ్గ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

మంత్రి కారుమూరి



అత్తిలిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: గత ప్రభుత్వాల కంటే భిన్నంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల మత రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం అత్తిలి సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు సైకో అని, మనం ఏడిస్తే ఆయన సంతోషిస్తాడని అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దించివేయాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలనే లక్ష్యంతో పనిచేస్తున్న గొప్ప దార్శనికుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సంక్షేమ పథకాల పేరుతో సీఎం డబ్బును పప్పు, బెల్లాలా పంచి పెట్టేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు నేడు తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని చెప్పడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనం అన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా సర్వేలో వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో 25 ఎంపీ సీట్లు వైఎస్సార్‌సీపీకి వస్తాయని చెప్పడం తమ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శమన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మండల జేసీఎస్ కన్వీనర్ పెన్మెత్స రామరాజు, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21 నుంచి అంతర జిల్లా క్రికెట్ పోటీలు

ఏలూరు రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి మంగళగిరిలో అంతర జిల్లాల క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఆదిత్యవర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–15, 19 బాలికల జట్లతో పాటు సీనియర్ మహిళ జట్టు ఎంపిక ఈ నెల 9న ఏలూరులోని ఆశ్రం కళాశాల మైదానంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారిణులు ఆధార్, డేటా ఆఫ్ బర్త్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

విజయవాడ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేత



రామారావుకు పింఛను అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: అడవిపాలెంకు చెందిన విస్సా రామారావు కిడ్నీ వ్యాధితో విజయవాడలోని పిన్నమనేని హాస్పటల్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. గత నెల వరకు వృద్ధాప్య పింఛను వచ్చేది. డయాలసిస్ రోగి కావడంతో వలంటీర్ యర్రమిల్లి బుజ్జిబాబు సిఫారసుతో ఈ నెల రూ.10 వేలు పింఛన్ మంజూరైంది. రామారావుకు పింఛను ఇవ్వడానికి అడవిపాలెం సచివాలయ సోషల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్లుల వెంకటరమణ మంగళవారం 150 కి.మీ దూరంలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి రామారావుకు పింఛన్ సొమ్ము అందజేశారు.

మిస్టరీగా బాలుడి అదృశ్యం కేసు

- రంగంలోకి దిగిన ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి
- బాలుడి కోసం ముగ్గురు డీఎస్పీల నేతృత్వంలో 8 బృందాలతో గాలింపు



కొత్త సరుగుడులో బాలుడి తల్లి రామలక్ష్మి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



పోలీస్ డాగ్‌తో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

బుట్టాయగూడెం: దొరమామిడి సమీపంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం నిర్మించిన కొత్త సరుగుడు గ్రామంలో 11 నెలల బాలుడు అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. ఆదివారం రాత్రి 12 గంటలకు తల్లి రామలక్ష్మి బిడ్డకు పాలిచ్చి నిద్రించిన తరువాత అర్ధరాత్రి సమయంలో తల్లి లేచి చూడగా బాలుడు కనిపించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మంగళవారం కోర్సవారిగూడెం గ్రామాన్ని సందర్శించి బాలుడి తల్లి రామలక్ష్మి, బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ బాలుడు అదృశ్యమైనట్టు అందిన సమాచారం మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించినట్టు చెప్పారు. పోలవరం డీఎస్పీ ఎ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాలుగు బృందాలు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంగళవారం మరో నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని, మొత్తం 8 బృందాలతో అనుమానితులను విచారించడంతో పాటు టెక్నికల్ ఎవిడెన్స్ తీసుకోవడంతో పాటు రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో బిడ్డ రవాణా జరిగిందనే కోణంలో కూడా దర్యాప్తు కోసం చర్యలు చేపట్టామన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం డీఎస్పీల ఆధ్వర్యంలో కూడా బృందాలు బాబు ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా బాలుడి అదృశ్యంపై ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేని పరిస్థితిలో ఉన్నారని చెప్పారు. ఈ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని బాబు ఆచూకీ కనిపెట్టే పనిలో పోలీస్ బృందాలు నిమగ్నమైనట్టు తెలిపారు. డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సైలు కె.వెంకన్న, ఎం.జయబాబు, వి.చంద్రశేఖర్‌తో పాటు ప్రత్యేక పోలీస్ బృందాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం ఏలూరు నుంచి పోలీస్ డాగ్ (డాన్)ను తీసుకువచ్చి నిందితుల జాడను గుర్తించే ప్రయత్నం చేశారు. బాలుడికి సంబంధించిన దుస్తులను పోలీస్ కుక్క వాసన చూసిన అనంతరం గ్రామ పడమర వైపు నుంచి ఉత్తరం వైపు రోడ్డుగా తూర్పు వైపు తిరుగుతూ మళ్లీ అదే ఇంటికి చేరుకుంది. అనుమానితులు కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నప్పటికీ మంగళవారం సాయంత్రానికి కూడా బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో ఈ కేసు మిస్టరీగానే ఉంది.

బిడ్డ కోసం తల్లి ఎదురుచూపులు

తన ఒడిలో నిద్రిస్తున్న బిడ్డ అదృశ్యం కావడంతో తల్లి మనోవేదనతో తల్లడిల్లుతోంది. పెరాలసిస్ వల్ల కాలు, చెయ్యితోపాటు మాటలు కూడా రాని ఆ అమాయకురాలు బిడ్డ కనిపించకుండా పోవడంతో ఎవరితో ఏం చెప్పాలో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. కనిపించకుండా పోయిన బిడ్డ కోసం తల్లి, మనువడి కోసం తాతయ్యలు ఎదురుచూస్తున్నారు. కొత్త సరుగుడు గ్రామంలో కొవ్వాసి రామలక్ష్మి, వెంకటేష్‌ల 11 నెలల బాబు సూర్యతేజ అదృశ్యమైన విషయం పాఠకులకు విదితమే. అయితే ఈ కేసుకు సంబంధించి పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నా మిస్టరీగానే ఉంది. అసలేం జరిగిందని బాలుడి తల్లి రామలక్ష్మిని, తాతయ్య రాంబాబును ప్రశ్నించగా పలు విషయాలను వెల్లడించారు. ఆదివారం సాయంత్రం ఇంటి వెనుక ఉన్న బంధువులైన చోడెం వెంకటేష్, సంధ్య వాళ్ల ఇంటి వద్ద రాత్రి 10 గంటల వరకు టీవీ చూసిన అనంతరం వచ్చి పడుకున్నట్లు చెప్పారు. అయితే తల్లి రామకృష్ణ, మొదటి కుమారుడు సూర్యప్రవీణ్ ఎడమవైపు, అదృశ్యమైన బాలుడు సూర్యతేజను కుడివైపు పడుకోబెట్టుకున్నానని, అర్ధరాత్రి 12 గంటలకు సూర్యతేజకు పాలిచ్చి నిద్రపోయినట్లు రామలక్ష్మి తెలిపింది. 2 గంటలకు లేచి చూడగా బాలుడు అదృశ్యమైనట్లు పేర్కొంది.

భర్త, స్నేహితులు వచ్చిన రోజు రాత్రే ఘటన

రామలక్ష్మి, వెంకటేష్ ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే భర్త వెంకటేష్ పులిరామన్నగూడెంలో ఉంటుండగా, రామలక్ష్మి మాత్రం కొత్త సరుగుడులో ఉంటోంది. మూడు నెలల క్రితం భార్య, పిల్లలను పులిరామన్నగూడెం తీసుకువెళ్లిన వెంకటేష్ నెల క్రితమే కొత్త సరుగుడు గ్రామం తీసుకువచ్చి వారిని దించి వెళ్లినట్లు భార్య రామలక్ష్మి తెలిపింది. మళ్లీ నెల తర్వాత ఆదివారం రామలక్ష్మి దగ్గరకు వెంకటేష్ వచ్చాడని, ఆ సమయంలో మాంసం తీసుకువచ్చి బాలుడు సూర్యతేజను ముద్దాడి వెళ్లే సమయంలో అప్పు తీర్చేందుకు తనకు రూ.600 కూడా ఇచ్చినట్లు చెప్పింది. తన భర్తతో పాటు కట్టుపల్లి, పులిరామన్నగూడెంకు చెందిన మరొక ఇద్దరు కూడా వచ్చారని తెలిపింది. వారు వెళ్లిన తర్వాతే ఈ సంఘటన చోటు చేసుకోవడంతో పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇదిలా ఉండగా పాకుతూ చలాకీగా తిరిగే రవితేజ ఆచూకీ కోసం పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లో అణువణువునా గాలించారు. అలాగే గ్రామ సమీపంలో కొండలు ఉండటంతో నక్కలు బాలుడిని తీసుకువెళ్లి ఉండొచ్చనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బంధువులు వారి మూఢనమ్మకాలతో అంజనం కూడా వేసి బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఆ రాత్రి మనువడిని ఆడించుకుంటూ ముద్దాడిన తాతయ్య రాముడు మనువడి ఆచూకీ తెలియకపోవడంతో తీవ్రమైన మనోవేదన చెందుతున్నాడు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



ఘటనా స్థలంలో బస్విరెడ్డి మృతదేహం, పక్కనే ఉన్న బైక్

పెనుమంట్ర: మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొన్న ఘటనలో ఓ ఫైనాన్స్ వ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం పసలపూడికి చెందిన పోతంశెట్టి వెంకటబస్విరెడ్డి (23) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపార పనులపై మంగళవారం ఉదయం 4.30 గంటలకు పసలపూడి నుంచి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. పెనుమంట్ర మండలం ఆలమూరు డ్రెయిన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన లారీ బస్విరెడ్డి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే బస్విరెడ్డి మృతి చెందాడు. ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన జరగగా అదే సమయంలో అక్కడ ఉన్న బస్విరెడ్డి బంధువు, మార్టేరుకు చెందిన రమేష్‌రెడ్డి ప్రమాదంలో చనిపోయింది బస్విరెడ్డి అని గుర్తించి ఈ విషయాన్ని పసలపూడిలో ఉంటున్న బస్విరెడ్డి సోదరి మల్లిడి వెంకట రమాదేవికి సమాచారం అందించాడు. ఆమె వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తమ సోదరుడిదేనని నిర్ధారించింది. ఈ ఘటన అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోదరి రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాపురంలో చైన్ స్నాచింగ్

కుక్కునూరు: వెంకటాపురంలో చైన్‌స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుక్కునూరు–బూర్గంపాడు ఆర్అండ్‌బీ రహదారి పక్కనే వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీరాముల భారతమ్మ (60) అనే వృద్ధురాలు గ్రామంలో చిన్న కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం ముఖానికి గుడ్డ, తలకు టోపి ధరించిన ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి దుకాణం వద్ద ఆగారు. అందులో బైక్ వెనక కూర్చున్న యువకుడు వెళ్లి పెట్రోల్ బాటిల్ కొని బైక్‌లో పోయించుకున్నాడు. అనంతరం కూల్‌డ్రింక్ కావాలని యువకుడు అడుగగా, వృద్ధురాలు డబ్బులు తీసుకుని కూల్‌డ్రింక్ ఇవ్వబోతుండగా మహిళ మెడలో ఉన్న బంగారు నెక్లెస్ లాక్కొని అప్పటికే సిద్ధంగా ఉన్న బైక్‌పై ఉడాయించాడు. ఈ ఆభరణం 25 గ్రాములు ఉంటుందని, దీని విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. కాగా మహిళ ఒంటరిగా ఉండడం చూసిన దుండగులు దొంగతనానికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ విషయమై భారతమ్మ కుటుంబసభ్యులు మంగళవారం కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడపగడపకు సంక్షేమం



తణుకు అర్బన్: తణుకు 8వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



ఆకివీడు: చిన కాపవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

హోమియో ఫలితాల్లో సత్తా చాటిన ‘ప్రత్తిపాడు’

- ముగ్గురు విద్యార్థులకు రాష్ట్ర ర్యాంక్‌లు
- 8 మందికి యూనివర్సిటీ ర్యాంక్‌లు



యూనివర్శిటీ ర్యాంకులు సాధించిన హోమియో వైద్య విద్యార్థులతో అధ్యాపకులు

పెంటపాడు: వైఎస్సార్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల ప్రత్తిపాడులోని ఆకుల శ్రీరాములు హోమియోపతి వైద్య కళాశాల విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేంద్ర చెప్పారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు, మరో 8 మంది యూనివర్శిటీ ర్యాంకులు సాధించారన్నారు. సోమవారం సాయంత్రం ఫలితాలు విడుదల అయిన సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో మూడేళ్ల హోమియో వైద్యవిద్యనభ్యసిస్తున్న 63 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కాగా ముగ్గురు విద్యార్థినులు బి.అనూరాధ (తృతీయ సంవత్సరం), కె.ప్రగతి (ద్వితీయ సంవత్సరం), వైవీఎస్ లలిత (ప్రథమ సంవత్సరం) స్టేట్ ర్యాంకులు, మరో ఎనిమిది మంది విద్యార్థులు యూనివర్శిటీ ర్యాంకులు సాధించారన్నారు.

హోమియో యూనివర్శిటీ టాపర్స్ వీరే..

హోమియా పరీక్షా ఫలితాలలో ప్రత్తిపాడు హోమియోపతి కళాశాల విద్యార్థులు వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ స్థాయిలో ర్యాంకులు సాధించారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేంద్ర తెలిపారు. వీరిలో బి.అనూరాధ, ఎస్.సుష్మ, ఎం.ప్రణతి, ఎస్.యామినీ భవాని, ఎం.ఉమామహేశ్వరి, బి.ప్రత్యూష, ఎం.రమ్య, కె.మనోజ్ ఉన్నారు. కాగా నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ ఆకుల విజయవర్ధన్, ప్రిన్సిపాల్ యూఎస్‌వీ ప్రసాద్ (ఆర్గనాన్), డాక్టర్ కె.బ్యూలా (సర్జరీ), డాక్టర్ స్వర్ణలత(గైనిక్), డాక్టర్ ఆనందరావు (ఎంఎం), డాక్టర్ సురేంద్ర తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

త్యాగశీలి వంగవీటి మోహనరంగా



తణుకులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, తదితరులు



పెనుగొండలో రంగా విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వంగవీటి రాధా

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- తణుకులో రంగా విగ్రహానికి నివాళి

తణుకు అర్బన్: పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడ్డ వంగవీటి మోహనరంగా త్యాగశీలుడని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వంగవీటి మోహనరంగా 76వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక సొసైటీ రోడ్డులోని రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పేదవర్గాల కోసం పోరాటం చేస్తూనే దుర్మార్గుల చేతిలో హత్యకు గురికావడం బాధాకరమన్నారు. రంగా స్ఫూర్తి సజీవంగా ఉండాలనే ఉద్దేశంతోనే తణుకులో ఆయన విగ్రహం ఏర్పాటు చేశామని, ఇప్పుడు ఈ వీధికి వంగవీటి మోహనరంగా వీధిగా నామకరణం చేయించామని చెప్పారు. త్వరలోనే వీధి మొదట్లో బోర్డు పెట్టిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నియోజకవర్గ కన్వీనర్ అద్దాల అనంతబాబు, నాయకులు గాజుల కాశీ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మారిశెట్టి శివశంకర్, ములగాల శ్రీనివాస్, పుల్లెపు సూరిబాబు, కొమ్మోజు రామకృష్ణ, గంజి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన రాధా

పెనుగొండ: కులాలకు అతీతంగా పేదలకు అండగా నిలిచి తన తండ్రి రంగా పేదల హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచారని మాజీ శాసన సభ్యుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. పెనుగొండలో రంగా జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి పెనుగొండ వంగవీటి మోహన రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. తొలుత పెనుగొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టరు కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు, ఎంపీపీ పూతినీడి పెద్ద, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, ఎంపీటీసీ కృష్ణకాంత్, ప్రియా సౌజన్య, ఎ.గాంధీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరుగొలనులో గుండె వైద్య శిబిరం



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో గుండె వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ నార్ని శంకరరావు, ఆరుగొలను ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన వై.వి.రావు, బృందంచే సుమారు వంద మందికి ఈజీసీ, ఏకో, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



రేలంగి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ప్లాస్టిక్ కలెక్షన్, యోగా పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పర్యావరణం పట్ల యువత జీవన శైలి గురించి ప్రధానోపాధ్యాయులు రవి వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు సానబోయిన ఝాన్సీ, జుత్తిగ అరుణ సాయి తదితరులు పాల్గొన్నారు.

మాధవరం సబ్ స్టేషన్ వద్ద ధర్నా



మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్‌వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మాధవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించాలని సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. పురిటిగడ్డ జయ మ్మ, గుత్తుల నర్సయ్య, నిచ్చెనకోళ్ల రాముడు, వెంకట్రావు, గోపాల్, గుత్తుల సత్యవతి పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు ఆపాలి



సమావేశంలో పాల్గొన్న సేవకులు

పెంటపాడు: దేశంలో క్రైస్తవులపై మతోన్మాదులు చేస్తున్న దాడులు తక్షణం ఆపాలని డీస్ట్రిక్ పాస్టర్లసంఘ అధ్యక్షుడు కొమ్మిశెట్టి జాజిరాజు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పడాల వాక్యజ్యోతి చర్చిలో ప్రపంచ క్రైస్తవ దినోత్సవం పురస్కరించుకొని క్రైస్తవుల కోసం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు శిష్యుడైన తోమాపై అలనాడు దాడులు జరిగిన రీతిగానే నేడు కూడా పలువురు మతోన్మాదులు దైవసేవకులు, మత పెద్దలపై దాడులు చేయడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఏ గౌరవ అధ్యక్షుడు బిషప్ డి. డేవిడ్, వైస్ ప్రెశిడెంట్ మోజెస్, ప్రధాన కార్యదర్శి డి. నోవహు, కో ఆర్డినేటర్ యు. జాన్సన్, వైస్ ప్రెశిడెంట్ మిఖాయేలు, డైరెక్టర్ ఐ. శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెంటపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్లు తోట రాజేష్, ఎస్ వెంకటరమణలతో పాటు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడు గ్రామంలో మంగళవారం పెంటపాడు పోలీసులు పేకాట శిబిరంపై దాడులు చేశారు. ఇన్‌చార్జ్ ఎస్సై డి. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో పేకాడుతుండగా నలుగుర్ని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 6,100 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా



వేల్పూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ భరోసా వస్తుందని పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇరగవరం మండలం అయినపర్రు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి సీఎం ఎవరూలేరన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య లక్ష్యసాధన, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయనివిధంగా గడపగడపకు అధికారులను తీసుకువెళ్లి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు సురక్ష పథకాన్ని రూపొందించారన్నారు. ఈ సభల్లో 11 రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులు కనీస సర్వీసు ట్యాక్స్ కూడా చెల్లించకుండా ఉచితంగా పొందేందుకు అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. వలంటీర్ల ద్వారా అన్ని సేవలు ఇంటివద్దకే అందిస్తున్నారని పేర్కొన్నారు. స్కూల్ పిల్లలకు అన్ని వసతులు కల్పిస్తు వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ సత్తి అఖిల, ఎంపీటీసీ సత్తి లీలా ప్రసన్న, నాయకులు సత్తి వెంకట రెడ్డి , సత్తి శ్రీనివాస్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం లబ్ధిచేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్: వేర్వేరు కారణాలతో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేకపోతున్నారని, వారందరికీ ధ్రువపత్రాలు అందించి, నూరు శాతం లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని తహసీల్దార్ వై.దుర్గా కిషోర్ అన్నారు. మంగళవారం మండలంలోని కడియద్ద, నవాబుపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు నిరక్షరాస్యులు కావడం వల్ల పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేని పరిస్థితి ఉందన్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి ధ్రువపత్రాలు అందజేసి, వారికి అర్హత ఉన్న పథకాలను అందించడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష ద్వారా వారి ఇంటి వద్దే జీవితాంతం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జగనన్న సురక్షలో 11 రకాల ధ్రువపత్రాలను అందిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాతం కోటేశ్వరి, ఎమ్పీటీసీ దారపురెడ్డి దుర్గాదేవి, ఉప సర్పంచ్ పాకనాటి వెంకట్రావు, మండల ప్రత్యేకాధికారి ఎం.దుర్గేష్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం. లక్ష్మి, ఉద్యాన వన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, కడియద్ద సచివాలయ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కె.శ్రీనివాస్, నవాబుపాలెం సచివాలయ కార్యదర్శి కడలి శ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), యాతం బూరయ్య, గట్టిం సాంబయ్య, దారపురెడ్డి శ్రీనివాస్, కొండపల్లి బుజ్జి, పాకనాటి తాతాజీ, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు మరింత చేరువ

తణుకు టౌన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో 1వ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా సీఎం వైఎస్ జగన్ పరిపాలనను ప్రజల చెంతకు తీసుకువచ్చారన్నారు. జూలై 1నుంచి జూలై 31 వరకూ అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో అధికారుల ప్రత్యేక బృందాలు ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, పథకాల పొందడంలో కలుగుతున్న అవరోధాలు తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. ప్రజలంతా ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ ఐకొట్టి శేషకుమారి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు చంద్రు శ్యామల, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, మండల, పట్టణ సచివాలయాల కన్వీనర్లు కరిబండి రాజేష్, ఇండుగపల్లి బలరామకృష్ణ, ఎంపీటీసీలు రెడ్డీ హైమా, విజయదుర్గ, తాడిపర్తి సుజాత, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నేడు జగ్గన్నపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ హౌసింగ్‌బోర్డు పరిధిలో 11 కేవీ మెయిన్ రోడ్డు ఫీడర్ విద్యుత్ లైన్‌లు, చెట్టు కొమ్మలు నరకడం తదితర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 5వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. మెయిన్ రోడ్డు, మునిసిపల్ కార్యాలయం, శేషమహల్, నందిబొమ్మ సెంటర్‌ల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోశయ్యకు ఘన నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య జయంతిని పట్టణంలో మంగళవారం ఆర్యవైశ్య కళ్యాణ మండపం కార్యాలయం వద్ద ఆర్యవైశ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు మండవల్లి చెన్నా నాగేంద్రరావు, మండా బ్రహ్మాజీ, నున్న సుందరరావు తదితరులు మాట్లాడుతూ రోశయ్య చేసిన సేవలను కొనియాడారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రజాసంక్షేమం



లబ్ధిదారునికి ధ్రువ పత్రం అందజేస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు

పెంటపాడు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కె. కృష్ణప్రసాద్‌లు తెలిపారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జట్లపాలెం, అలంపురం గ్రామాల్లో రెండు టీంల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని తక్షణం అక్కడే సంబంధిత వ్యక్తులకు ధ్రువపత్రాలు అందజేశారు. జట్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, డీపీవో మల్లి కార్జునరావులు పాల్గొన్నారు. ఆయా సచివాలయాల వద్ద గ్రామ సభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో జరిగిన సమావేశంలో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవోల అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, గుమ్మళ్ల రత్నరాజు, జట్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఆర్‌ఐ కనకదుర్గ, పార్టీ నాయకులు, రెండు టీం సభ్యులు, వాలంటీర్లు, గృహసారదులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేల్పూరు జగనన్న లేఅవుట్‌లో వీధిలైట్ల ప్రారంభం



వేల్పూరు జగనన్న లేవుట్‌లో వీధిలైట్లను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో వీధి లైట్లను పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. మంగళవారం వేల్పూరు గ్రామంలోని కావలిపురం లేఅవుట్‌లో నూతన గృహాల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నందున పనులకు ఇబ్బందులు లేకుండా కాలనీలో వీధిలైట్లతో పాటు గృహావసరాలకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కాలనీలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎలక్ట్రికల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, విద్యుత్ ఏఈ పెద్దిరాజు, హౌసింగ్ ఏఈ వీ వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీరులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



తణుకు 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 8వవార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటుంబంలో అభివృద్ధి సాధించగలిగితే అది రాష్ట్రం తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అందుతున్న సంక్షేమ ఫలాలు చారిత్రాత్మకమని, యావత్ భారతదేశం ఏపీవైపు చూసే పరిస్థితులు జగనన్న ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి తీసుకువచ్చారని స్పష్టం చేశారు. అందుకు నిదర్శనంగా ఇతర రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలో విద్యావ్యవస్థలోను, వైద్యరంగంలోను దినదినాభివృద్ధి చెందుతుందని అన్నారు. సంక్షేమ ఫలాలను సైతం పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ వారి మన్ననలు పొందుతున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ముఖ్యమంత్రి ఎంతో సఫలీకృతులయ్యారని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా అధికారులను మంత్రి కారుమూరి ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంక ట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, చంద్రరావు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ నిమిత్తం నిర్వహించే చలో హైదరబాద్ జూలై మూడో వారంలో 20 లక్షల మందితో నిర్వహిస్తున్నట్లు మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) జిల్లా అధికారి ప్రతినిధి విసంపల్లి సిద్దు మాదిగా తెలిపారు. పట్టణంలో రజక భవనంలో పార్టీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సిద్దూ మాట్లాడుతూ చలో హైదరాబాద్ నిమిత్తం ప్రజల సమీకరణ కోసం ఈ నెల 6వ తేదీన సన్నాహాక సభ నరసాపురంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి మందకృష్ణ మాదిగ రానున్నారని వెల్లడించారు.

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, సీపీ ఎన్‌వీ రమణారావు, సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, నూకల నాగ మల్లేశ్వరరావు, కోపల్లె శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్, డైమండ్స్, లియో, వశిష్ట క్లబ్స్ సభ్యులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అల్లూరి ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం

తణుకు టౌన్: మన్యం విప్లవ వీరుడు, అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని వైఎస్సార్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇరగవరం: మండలంలోని అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీఎంఎస్ డైరెక్టర పెన్మెత్స సుబ్బరాజు అన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనంలో మంగళవారం ఉపకులపతి టి.జానకిరామ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

పేదల పెన్నిధి వంగవీటి మోహనరంగా



తాడేపల్లిగూడెం రూరల్: కడియద్ద గ్రామంలో వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం: గొల్లగూడెం సెంటర్‌లో రంగా జయంతి



తణుకు టౌన్: మండపాకలో రంగా జయంతి సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం



అత్తిలిలో వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా కేకు కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు వంగవీటి మోహన రంగా అని మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కడియద్ద గ్రామంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా 76వ జయంతిని నిర్వహించారు. తొలుత రంగ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దారపురెడ్డి శ్రీనివాస్, యాతం బూరయ్య, పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), గట్టిం సాంబయ్య,చీకట్ల మల్లేశ్వరరావు, కొండపల్లి బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహన్ రంగా జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గొల్లగూడెం సెంటర్‌లో నియోజకవర్గ కాపునాడు బాల బొమ్మల శ్రీనివాస్ అధ్యక్షతన రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. రంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మాకా శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మార్నీడి బాబ్జి, కె.శ్రీనివాస్, జగతా ప్రసాద్, శ్రీనివాస్, కుమారస్వామి, చింతన, తదితరులు పాల్గొన్నారు.

రంగాకు ఘన నివాళులు

తణుకు టౌన్: వంగవీటి మోహనరంగారావు జయంతి వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో రంగా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు చీర్ల రాధయ్య, కాపు యూత్ సభ్యులు పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగా జయంతి వేడుకలలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాపు యూత్‌తో పాటు వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పీ వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. దువ్వ గ్రామంలోని రంగా విగ్రహానికి గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, పార్టీ అధ్యక్షుడు ఎస్ గోపాలకృష్ణ,లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తేతలి గ్రామంలో జరిగిన రంగా జయంతి వేడుకలలో చీర్ల రాధయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు

అత్తిలి: వంగవీటి మోహనరంగా 76వ జయంతిని మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి పట్టణ అధ్యక్షుడు యడ్లపల్లి మణికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, కాపు సంఘ నాయకుడు కందుల సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, గంటా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరదాళ్లపాలెంలో రంగా విగ్రహం ఆవిష్కరణ

ఉరదాళ్లపాలెం గ్రామంలో మెయిన్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన కాపు సంఘనేత వంగవీటి మోహన్‌రంగా విగ్రహాని సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇరగవరంలో వంగవీటి మోహన్ రంగ జయంతి

ఇరగవరం: మండలంలోని ఇరగవరం, కె ఇల్లిందలపర్రు, అర్జునుడు పాలెం, తూర్పు విప్పార్రు, కాకిలేరు, కత్తవపాడు గ్రామల్లో వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగా విగ్రహనికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో కుంచే కొండయ్య, గండ్రోతు రామారావు, కుంచే నాగ బాబు తదితరులు పాల్గొన్నారు.